క్లుప్తంగా

సీఎంను కలిసిన అర్జున్



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్జున్

మిర్యాలగూడ టౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో కలిసి మిర్యాలగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్ ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా సీఎంను శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా కుల గణనకు ప్రభుత్వం సహకరించినందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తమ్మడబోయిన అర్జున్ మాట్లాడుతూ నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరినట్లు ఆయన తెలిపారు. వారితో పాటు వట్టె జానయ్య తదితరులున్నారు.

సీపీఎం బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ

చింతపల్లి: మిర్యాలగూడలో సోమవారం నిర్వహించనున్న సీపీఎం 21వ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ పిలుపునిచ్చారు.ఆదివారం మండల పరిధిలోని వింజమూరు స్టేజి వద్ద మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. మిర్యాలగూడలో 2,3,4 తేదీల్లో నిర్వహించే మహాసభలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వుడుగుండ్ల రాములు, యాదయ్య, ఏర్పుల మైబు, ఆరకంటి వెంకటయ్య, పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో విజయోత్సవాలు

పెద్దవూర: కలెక్టర్ ఆదేశానుసారం ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ప్రజాపాలన విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారి కొల్లు బాలకృష్ణ, పాఠశాల హెచ్ఎం డి.బాలోజీ, ఉపాధ్యాయులు బి.కృష్ణ, నాగేందర్, కమలమ్మ, రాము, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ: అకారణంగా తనపై దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఆవుల పెదఎల్లయ్య కోరారు. ఆదివారం బాధితుడు పెదఎల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం తెట్టెకుంట గ్రామానికి చెందిన ఆవుల పెదఎల్లయ్యకు సర్వే నెం.208 పట్టా భూమిలో ఆలంపల్లి వసంత్, ఆలంపల్లి ప్రసాద్, ఆలంపల్లి సతీష్ అక్రమంగా రాళ్లు పాతి ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారు. దీనిని అడ్డుకోబోయిన పెద్ద ఎల్లయ్యపై వారు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అక్రమంగా పట్టా భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించి, తనపై దాడి చేసిన వ్యక్తులపై వాడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎల్లయ్య తెలిపాడు. గాయాలపాలైన పెదఎల్లయ్యను కుటుంబ సభ్యులు మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

బీజేపీతోనే అవినీతి రహిత పాలన సాధ్యం

హాలియా : బీజేపీతోనే అవినీతి రహిత పాలన సాధ్యం అని నాగార్జున సాగర్ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ చలమల వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం తిరుమలగిరి(సాగర్) మండలంలోని మేగ్యాతండా గ్రామానికి చెందిన గిరిజన మోర్చా పాలసీ రీసెర్చ్ జిల్లా కో కన్వీనర్ కేతావత్ పార్వతికి బీజేపీ సభ్యత్వ నమోదును అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

రాంపురంలో వైద్యశిబిరం

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని రాంపురం గ్రామంలో నల్లగొండ సూర్య ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ఉచితవైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సుకే ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది,గ్రామస్తులు తదితరులున్నారు.

వ్యాసరచన పోటీలో ప్రతిభ

కొండమల్లేపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాల్లో భాగంగా పునరుద్ధరించే ఇంధన వనరుల వినియోగం అంశంపై మండల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కొండమల్లేపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని మహియ ప్రథమ స్థానం, వేణుగోపాల్ తృతీయ స్థానంలో నిలువగా తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని కె.లలిత ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆదివారం ఎంఈఓ ఆర్.నాగేశ్వర్‌రావు అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరస్వతి, యాదయ్య, గణేష్ పాల్గొన్నారు.

ఆస్తిపన్ను బకాయి@రూ.20కోట్లు

- అరకొరగా చెల్లింపులు.. పేరుకుపోయిన బకాయిలు
- పన్నులు చెల్లించకుంటే రెడ్ నోటీసు
- మొండి బకాయిలు రాబట్టేందుకు అధికారుల చర్యలు



మిర్యాలగూడ మున్సిపాలిటీ కార్యాలయం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఆస్తిపన్నులు భారీగా పెరుకుపోయాయి. పన్నులు చెల్లించని యాజమానులు, ప్రభుత్వ కార్యాలయాల అధికారులకు నోటీసులు ఇస్తున్నప్పటికీ వారి నుంచి స్పందన రావడం లేదు. కొన్ని శాఖల వారు ఏళ్ల తరబడి పన్నులు చెల్లించడం లేదు.

ఆస్తి పన్నుల ఆదాయం రూ.25.11 కోట్లు

మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం నివాస గృహాలు 26,138 ఉండగా వ్యాపార సముదాయాలు 2125, నివాసం, వ్యాపార సముదాయలు(మిక్స్‌డ్) 1,604లతో పాటు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు 544 వరకు ఉన్నాయి. అయితే వీటి ద్వారా పన్నుల రూపంలో మున్సిపాలిటీకి రావాల్సిన రూ.25 కోట్ల 11లక్షల 21 వేల రూపాయల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. గత మార్చి నుంచి ఇప్పటి వరకు కేవలం రూ.4.78లక్షల మాత్రమే వసూలయ్యాయి. మిగిలిన రూ.20.33కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అయితే, నవంబరు 29వ తేదీ వరకు కేవలం 19.4శాతం మాత్రమే ఆస్తి పన్నులు వసూలయ్యాయి. కాగా, ఈ ఏడాది రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు రూ.3.18 కోట్లు పెరుకుపోగా ఈ తొమ్మిది నెలల కాలంలో కేవలం రూ.30 లక్షలు మాత్రమే చెల్లించారు.

రెడ్ నోటీసు జారీకి సిద్ధం

మున్సిపాలిటీకి ఆస్తి పన్నులు చెల్లించాల్సిన మొండి బకాయిదారులు టాప్ టెన్‌లో వందమందికి పైగానే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరందరికీ రాష్ట్ర మున్సిపాలిటీ చట్టం 2019 సెక్షన్ ప్రకారం రెడ్ నోటీసులు జారీ చేసేందుకు మున్సిపల్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వారంలో ఇంటింటికీ వెళ్లి నోటీసులు పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధమైనట్లు తెలిసింది. ఈ వారం నుంచి రెవెన్యూ, మున్సిపాలిటీ వారు తమ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇంటి పన్నులతో పాటు ట్రేడ్ లైసెన్స్ సైతం వసూలు చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

సకాలంలో చెల్లించాలి



మున్సిపాలిటీలోని ప్రజలు ఆస్తి పన్నులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి. ఆస్తి పన్నులు చెల్లించని వారిపై ప్రత్యేక దృష్టి సారించాం. అవసరమైతే మొండి బకాయిలు చెల్లించని వారి కనీస సౌకర్యాలు నిలిపివేసేందుకు వేనుకాడం. ప్రతి ఒక్కరు బిల్లులను సకాలంలో చెల్లించి సిబ్బందికి సహకరించాలి.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్

ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం



ప్రభుత్వ స్థలాన్ని చదును చేస్తున్న జేసీబీ

మిర్యాలగూడ: మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం గ్రామంలో గల జంగాల కాలనీ సమీపంలో ఉన్న ప్రభుత్వ, అటవీ భూమిని కాజేసేందుకు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు జేసీబీ సహాయంతో చదును చేయడం ప్రారంభించారు. దీంతో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఈ విషయాన్ని సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్ దృష్టికి తీసుకెళ్లగా తహసీల్దార్ హరిబాబును సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు. ఆర్ఐ సత్యనారాయణ భూ ఆక్రమణ ప్రదేశానికి వెళ్లి పరిశీలించగా అక్కడ జేసీబీ భూమిని చదును చేస్తుండడంతో పనులను నిలిపివేశారు. ఆక్రమణ చేస్తున్న వ్యక్తులు తమ వద్ద భూమికి సంబంధించిన పట్టా కాగితాలు ఉన్నాయని తెలపగా ఏమైనా ఉంటే తహసీల్దార్ వద్దకు వచ్చి చూపించిన తరువాతనే పనులు చేయాలన్నారు. అలా చేయకుండా పనులు ప్రారంభిస్తే కేసులు నమోదు చేస్తామని ఆర్ఐ సత్యనారాయణ హెచ్చరించారు. ఈ గుట్ట ప్రాంతంలో సుమారు నాలుగు ఎకరాల వరకు ప్రభుత్వ , అటవీ భూములు ఉన్నట్లుగా గ్రామస్తులు పేర్కొంటున్నారు. వెంటనే సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి అటవీ , ప్రభుత్వ భూములను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గిరిజన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ టౌన్ : గిరిజన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్ర కృష్ణ కాంత్‌నాయక్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బాణోతు సైదులునాయక్ కోరారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించి నూతన పీఆర్‌సీ ప్రకటించాలన్నారు. ప్రతి పాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేసి పదోన్నతులు కల్పించాలన్నారు. వివిధ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతినాయక్, బాషానాయక్, మక్లానాయక్, అరుణ, శంకర్, శ్రీనివాస్‌రావు, బాలునాయక్, గిరినాయక్, విద్యాచందర్‌నాయక్, రాంజీ, కపూర నాయక్, రాందాస్‌నాయక్, బాబునాయక్, శ్రీను, నాగేశ్వర్‌రావు తదితరులున్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది



ఉపాధ్యాయురాలు వరలక్ష్మిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్

మిర్యాలగూడ టౌన్ : ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందని మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ అన్నారు. ఆదివారం ఆడవిదేవులపల్లిలో ఉపాధ్యాయురాలుగా పని చేసి పదవి వీరమణ పొందిన వరలక్ష్మి, ఆమె భర్త శ్రీపతి శ్రీనివాస్‌లను పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో ఆమె నివాసానికి వెళ్లి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ పట్టణ అధ్యక్షుడు రాంరెడ్డి, మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, అడవిదేవులపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు కిశోర్‌నాయక్, రంగారెడ్డి, శ్రీనివాస్‌రావు, నాయకులు అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, గోపినాయక్, మామిళ్ల శ్రీనివాస్ రెడ్డి, విష్ణు, నర్సింహ్మనాయక్, అంబటి శ్రీను, వెంకట్, జానపాటి శ్రీను, యాదగిరిరెడ్డి, వెంకటరెడ్డి, కాశీ యాదవ్ తదితరులున్నారు.

జూనియర్ సివిల్ జడ్జి తేజస్వినికి సన్మానం



జూనియర్ సివిల్ జడ్జి తేజస్విని సన్మానిస్తున్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ సంఘం సభ్యులు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన తేజస్విని ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో వెలువడిన ఫలితాల్లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ గౌస్ పాషా ఆధ్వర్యంలో ఆమెను మండల కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తేజస్విని మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నూతనకంటి ఈశ్వర్, మంగ, ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా ట్రెజరర్ పెద్దిశెట్టి సత్యనారాయణ, బండి నరేష్, ముశిని అంజన్, పాక అనిల్‌యాదవ్, తుకారాం, బాబునాయక్, రామకృష్ణ, మల్లేష్, బాబునాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమరుడు పోలీస్ కిష్టయ్యకు ఘన నివాళి



మిర్యాలగూడ : నివాళులర్పిస్తున్న నాయకులు



దేవరకొండలో..

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ మలిదశ ఉద్యమ అమరుడైన పోలీస్ కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోలా సైదులు ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మహాత్మాజ్యోతిరావ్‌పూలే బీసీ భవన్‌లో కానిస్టేబుల్ పుట్టకొక్కుల కిష్టయ్య ముదిరాజ్ వర్ధంతిని బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ జేఏసీ కో కన్వీనర్ జయరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు బంటు సైదులు, శిరసనగండ్ల ఈశ్వరాచారి, కొంక వెంకన్న, నల్లగంతుల నాగభూషణం, మురళియాదవ్, సింగు రాంబాబు, వెంకటేశ్వర్లు, యాదగిరి, రాజశేఖర్, నారాయణ ఉన్నారు.

పోలీస్ కిష్టయ్యకు నివాళి

దేవరకొండ: తెలంగాణ మలిదశ అమరుడు పోలీస్ కిష్టయ్య వర్ధంతిని ఆదివారం పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ అతడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కిష్టయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాసమల్ల నాగయ్య,జింకల లింగయ్య, తూటుపల్లి శ్రీను,రెడ్డి శంకర్,జింకల రవి,పంగ అజయ్, నీలం వెంకటయ్య,జింకల మధు, రాంబాబు,రాములు ఉన్నారు.

ఘనంగా పోలీస్ కిష్టయ్య వర్ధంతి



డిండి: కిష్టయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

డిండి: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర మలిదశ ఉద్యమంలో అమరుడైన పోలీస్ కిష్టయ్య వర్ధంతిని ఆదివారం మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కమ్యూనిటీ హాల్లో కిష్టయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీను, ప్రేమ్‌కుమార్, సుధాకర్, శ్రీను, మల్లేష్, సాయిబాబా, సందీప్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

నోముల నర్సింహయ్యకు ఘన నివాళి



నోముల నర్సింహయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న నోముల భగత్ తదితరులు

త్రిపురారం : సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య వర్ధంతిని నిడమనూరు మండలంలోని వేంపాడు గ్రామ పరిధిలో నర్సింహయ్య కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేంపాడు స్టేజి వద్ద ఉన్న నోముల నర్సింహయ్య విగ్రహానికి నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్ తన తల్లి నోముల లక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి నర్సింహయ్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నోముల భగత్ యాదవ్ మాట్లాడుతూ సాగర్ నియోజక వర్గ ప్రజలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ట్రికార్ మాజీ చైర్మన్, ఆల్ ఇండియా బంజారా సేంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ రాంచందర్ నాయక్, యడవెల్లి విజయేందర్ రెడ్డి, సంపత్ కుమార్, ఉద్యమ కారులు, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణకు చర్యలు తీసుకోవాలి



త్రిపురారం : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



నాగార్జునసాగర్: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

త్రిపురారం : ఎయిడ్స్ చికిత్సకు ఆందోళన చెందకుండా ఎప్పటికప్పుడు నివారణ చర్యలు తీసుకోవాలని త్రిపురారం మండల వైద్యాధికారి డాక్టర్ శంకర్ నాయక్ సూచించారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా త్రిపురారం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, ప్రధాన సెంటర్‌లో ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నందికొండ హిల్‌కాలనీలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీగురుకుల విద్యాలయ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ముందుగా డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.రాజశేఖర్, ప్రోగ్రాం ఆఫీసర్ డి.కృష్ణ, కళాశాల అధ్యాపకులు గాయత్రి, సంతోష్‌కుమార్, రామయ్య, యాదగిరి, లింగయ్య పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

కొండమల్లేపల్లి : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుందని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని గుర్రపుతండాలో అయ్యప్ప మాలాధారులు నిర్వహించిన అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు.



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

బేస్ బాల్ జట్ల ఎంపిక



బేస్ బాల్ జట్లకు ఎంపికైన క్రీడాకారులు

మిర్యాలగూడ: జగిత్యాలలో ఈనెల 7,8,9 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ మహిళా క్రీడా పోటీలకు, 13,14,15 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పురుష బేస్ బాల్ క్రీడా పోటీలకు ఆదివారం మిర్యాలగూడలో నల్లగొండ జిల్లా పురుష, మహిళ జట్లను ఎంపిక చేసినట్లు బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అమరావతి సైదులు, చిర్ర మల్లేష్ ఆదివారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సెలక్షన్స్‌కు నల్లగొండ జిల్లా నలుమూలల నుంచి 160 మంది పురుష, మహిళా క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ పోటీలకు అతిథులుగా ట్రాఫిక్ ఎస్ఐ బండి మోహన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కన్నెబోయిన వెంకటరత్నం, బి.వెంకటరత్నం, మద్దె వెంకటేశ్వర్లు, లక్ష్మణ్‌యాదవ్, ఉస్మాన్ షేక్, జోజి, సునీత ఉన్నారు.

మాలధారులకు అన్నదానం



దంపతులను సన్మానిస్తున్న అయ్యప్ప స్వాములు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ చంద్రమౌళీశ్వర అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప మాలాధారులకు ఆదివారం మండల పరిధిలోని కోల్‌ముంతలపహాడ్ గ్రామ మాజీ ఎంపీటీసీ మాద్గుల లక్ష్మి యాదగిరి దంపతుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలాధారులు అన్నదాత దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో గురుస్వామి చిట్టెడు ప్రభాకర్‌రెడ్డి, మాలాదారులు గజ్జి లింగయ్యయాదవ్, బోడ కుమార్, తోటపల్లి కృష్ణ, గోరియా పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రజాపాలన విజయోత్సవాలు

- మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్



మాట్లాడుతున్న కమిషనర్ మహ్మద్ యూసుఫ్

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పట్టణంలో ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ తెలిపారు. ఆదివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విజయోత్సవ ర్యాలీ మొదటి రోజు స్థానిక అమర వీరుల స్థూపం వద్ద నుంచి ప్రారంభం అవుతుందని తెలిపారు. అదే విధంగా మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు, మహిళా శక్తి యూనిట్లు, టూకేరన్ వంటి కార్యక్రమాలను ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజాపాల కార్యక్రమంలో భాగంగా మగ్గుల పోటీలు, చెత్తను తొలగించడం, పబ్లిక్ టాయిలెట్లు, ప్రభుత్వ పాఠశాలలు, మున్సిపల్ సిబ్బందికి వైద్య శిబిరం, మత, చారిత్రాత్మక కట్టడాలు, సంబంధిత ప్రార్థన మందిరాల వద్ద పారిశుద్ధ్య కార్మికులతో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం, పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం, మహిళా శక్తి స్టాల్స్ ప్రదర్శన వంటివి ఉంటాయని వివరించారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, పర్యావరణ ఇంజనీరు శ్వేతారెడ్డి తదితరులున్నారు.

గ్యాస్ సంస్థల ఆధ్వర్యంలో వంటల పోటీలు



మహిళలకు వంటల పోటీలు నిర్వహిస్తున్న గ్యాస్ సంస్థల నిర్వాహకులు

మిర్యాలగూడ: హెచ్‌పీ, ఇండేన్, భారత్ గ్యాస్ ఏజెన్సీల ఆధ్వర్యంలో పట్టణంలోని కృష్ణకాలనీ హరివిల్లు అపార్ట్‌మెంట్‌లో ఆదివారం మహిళలకు సురక్షిత గ్యాస్ వినియోగం, అత్యవసర నంబర్ 1906 వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం వంటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌పీ గ్యాస్ డీలర్ ప్రతాప్ మాట్లాడుతూ మహిళలు సురక్షిత విధానంలో వంట చేయాలని, గ్యాస్ పైపు, రెగ్యులేటర్ తనిఖీ చేస్తూ ఉండాలన్నారు. అత్యవసర సమయాల్లో 1906 నంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు. వ్యాపారవేత్త గుడిపాటి నవీన్ సతీమణి అనిత న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గుడిపాటి నవీన్, నరేందర్, విజయ్‌కుమార్, భాగ్యలక్ష్మి, పద్మ, మంజుల పాల్గొన్నారు.

న్యాయ చట్టాలపై అవగాహన అవసరం



జడ్జికి మొక్క అందజేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

త్రిపురారం : న్యాయ చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. ఆదివారం నిడమనూరు మండల కేంద్రంలో నిర్మిస్తున్న కోర్టు నూతన భవనాన్ని ప్రధాన న్యాయమూర్తి నాగరాజుతో కలిసి పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో కోర్టు భవన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ముందుగా కోర్టుకు వచ్చిన ప్రధాన న్యాయమూర్తికి ఎమ్మెల్సీ మొక్క అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఇంచార్జి సీనియర్ సివిల్ జడ్జి సుమబాల, బార్ అసోసియేషన్ న్యాయవాదులు మువ్వ అరుణ్ కుమార్, బొల్లం శ్రీనివాస యాదవ్, పుల్లారెడ్డి, వలసాని నాగరాజు, వినోద్, పాదిల శ్రీనివాస్, మేఘారెడ్డి, గోదాల వెంకట్‌రెడ్డి, మట్టయ్య, జయమ్మ, స్వర్ణలత, లలిత, కోటేశ్వర్ రెడ్డి, బీఎస్ఎస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మిర్యాలగూడ: విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం ఆయన దామరచర్ల మండలంలోని వాచ్యాతండాలో గల తెలంగాణ ఆదర్శ బాలికల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో మెస్ చార్జీలను పెంచారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నిర్వాహకులతో మాట్లాడుతూ విద్యార్థినులకు అందించే ఆహారం విషయంలో ఫిర్యాదులు రావద్దని, నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ఘనంగా కార్తీక మాస పూజలు



కాలభైరవ అలంకారంలో మహాశివుడు

పెద్దవూర: కార్తీక మాసం చివరిరోజు ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని మండలంలోని బట్టుగూడెం గ్రామంలోని ఇష్టకామేశ్వరీ సమేత ఇష్టకామేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం వేకువజామునే ఆలయ ప్రధాన పూజారి సూరిభట్ల అనంతరామశర్మ శివుడికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఇష్టకామేశ్వరస్వామిని మహారుద్ర కాలభైరవ అవతారంలో ప్రత్యేక అలంకరణ గావించారు. సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై దీపాలను వెలిగించి పూజలు చేశారు. కార్యక్రమంలో నక్కల శంకర్‌రెడ్డి, గాలి లింగారెడ్డి, గాలి సైదిరెడ్డి, కత్తి విష్ణువర్ధన్‌రెడ్డి, ఏడుకొండలు, సత్యనారాయణరెడ్డి, కాసర్ల శంకర్ పాల్గొన్నారు.

ఆలయాల్లో మాజీ ఎమ్మెల్యే పూజలు



భాస్కర్‌రావును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మిర్యాలగూడ: మిర్యాలగూడ మండలంలోని అవంతీపురంలో కొలువైన సరస్వతీ ఆలయంలో సర్వదేవతల హోమం, వేంటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన హోమాన్ని ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు తిప్పరినేని శరత్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు హాజరై అమ్మవారు, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రామ్మూర్తి, ఆలయ అర్చకులు, నాయకులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన

త్రిపురారం : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆదివారం ప్రజా పాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా నిడమనూరు మండలంలోని పలు గ్రామాల్లో కళాకారుల బృందం కళాజాతా నిర్వహించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏకకాలంలో రుణమాఫీ, గృహాలకు ఉచిత కరెంటు వంటి తదితర పథకాలపై పల్లెపాటలతో కూడిన నృత్యాలు చేస్తూ అవగాహన కల్పించారు.